
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

5★★

ఆదివారం 4 ఆగస్టు 2024



స్వచ్ఛదనం పచ్చదనం



- పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలు
- ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా మొక్కల పెంపకం
- ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ప్రత్యేక పనులు
- ప్రత్యేక అధికార బృందాల ఏర్పాటు
- ఎప్పటికప్పుడు నివేదికల అందజేత

జగిత్యాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పల్లెలు, పట్టణాల్లో ఇక స్వచ్ఛద నం.. పచ్చదనం పేరిట అభి వృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించేం దుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇటీవల శాసనసభ సమావేశాల్లో మంత్రి సీతక్క ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈఅంశంపై మూడు రోజుల క్రితం సీఎస్ శాంతి కుమారి హైద్రాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు అధికారుల తో మాట్లాడారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేలా మొక్కల పెంపకం, ఇతర చర్యలు చేపట్టా లని సూచించారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛదనం...పచ్చదనం కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాలు జారీ..

జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాలు, పల్లెల్లో ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమా లను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఏ రోజు ఏఏ కార్యక్రమాలను నిర్వహించాలో తెలియ జేస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. సీఎస్ శాంతి కుమారి ఇటీవల జిల్లా అధికారులతో వీడి యో కాన్ఫరెన్స్ నిర్వహిం చి దిశానిర్దేశం చేశారు. అనం తరం కలెక్టర్ సత్యప్రసాద్ జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులతో సమీక్షించి పలు సలహాలు, సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు, ప్రజా ప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యం స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాల్లో ఉండేలా చూడాలని సూచించారు.

తొలి రోజు చేపట్టాల్సిన పనులు...

పల్లెలు, పట్టణాల్లో స్థానిక నాయకులు, మహిళా సంఘాలు, యువతతో అవగాహనా ర్యాలీలు నిర్వ హించాలి. ఇళ్లలోని చెత్తను సేకరించి కంపోస్టు ఎరువులు తయారుకు ప్రయత్నించాల్సి ఉంటుంది. పారిశుధ్యం, మొక్కల పెంపకం, సీజనల్ వ్యాధులపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తారు. ప్రభు త్వ కార్యాలయాలు, ప్రదేశాలను శుభ్రపరుస్తారు. చెత్త సేకరణ వాహనాలను జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం అమర్చనున్నారు. మరుగుదొడ్లు లేని వారికి మంజూ రు చేయాల్సి ఉంటుంది.

రెండో రోజు...

తాగునీటి వనరులను శుభ్రపరుస్తారు. రోజూ క్లోరి నేషన్ నిర్వహించేలా చైతన్య పరిచే కార్యక్రమాలను నిర్వహించనున్నారు. క్లోరినేషన్ కిట్లను అందుబాటు లో ఉంచుతున్నారు. ఇంకుడు గుంతలు లేని ఇళ్ల వద్ద వాటిని నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. తాగునీటి చెరువులు, కుంటలు కలుషి తం కాకుండా స్థానికులకు అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

మూడో రోజు....

మురుగు కాల్వల్లో పూడిక తొలగించనున్నారు. వర్షం, మురుగునీరు నిలవకుండా డ్రైనేజీ మళ్లించా ల్సి ఉంటుంది. ముంపు ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టనున్నారు. స్థానిక రోడ్లపై గుంతలను మట్టితో పూడ్చి రోలింగ్ చేయనున్నారు. తాగునీటి చేతి పంపులు, పైప్ లైన్ల వద్ద మురుగు నీరు నిలవ కుండా చూసుకోనున్నారు.

నాలుగో రోజు....

వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వ హించి సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా వంటి వాటిపై అవగాహన కల్పించనున్నారు. గ్రామాల్లో జ్వర సర్వే నిర్వహించనున్నారు. ప్రజలు తరచూ జ్వరం బారిన పడుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. నీరు నిల్వ ఉన్నచోట ఆయి ల్ బాల్స్ వినియోగించనున్నారు. ఎనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు. వీధి కుక్కల సంఖ్య తేల్చి గ్రామ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్ల సమన్వయంతో వాటిని ఏబీసీ కేంద్రాలకు తరలిస్తారు.

చివరి రోజు నిర్వహించాల్సిన కార్యక్రమాలు...

మంగళ, శుక్రవారాలను డ్రైడేగా పాటించాల్సి ఉం టుంది. ప్రభుత్వ సంస్థల కార్యాలయాలు, భవనాలు శుభ్రం చేయడం వంటివి నిర్వహించనున్నారు. శిధి లావస్థకు చేరిన భవనాలను తొలగించనున్నారు. రోడ్ల పక్కన ఎండిపోయిన చెట్లను తీసేయడం తది తర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ప్రజల సహకారంతోనే విజయవంతం చేస్తాం

సత్య ప్రసాద్, కలెక్టర్



అన్ని వర్గాల భాగస్వామ్యం తో స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాము. పల్లెలు, పట్టణాల్లో పారిశుద్యం, పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడానికి అనుగుణంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, యువజన, మహిళా సంఘాల సభ్యులు ఇలా అన్ని వర్గాలు పాల్గొనాల్సి ఉంటుంది. పకడ్బందీగా కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశాము.

ప్రత్యేక అధికార బృందాల ఏర్పాటు...

ప్రతీ గ్రామానికి మండల స్థాయి అధికారిని, మున్సిపల్ వార్డులకు గెజి టెడ్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తున్నారు. గ్రామ స్థాయి బృందంలో పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేక అధికారి, ఆశా కార్యకర్త, గ్రామ సంఘంలోని ముగ్గురు ఆఫీస్ బేరర్స్, ఇతర గ్రామ స్థాయి సిబ్బంది బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. వార్డు బృందంలో స్థానిక కౌన్సిలర్, వార్డు మెంబర్, వార్డు అధికారి, ప్రత్యేక అధికారి, రిసోర్స్ పర్సన్‌లు కార్య క్రమ బాధ్యతలు నిర్వర్తిస్తారు.

ఏ రోజుకు ఆ రోజు సమీక్షిస్తూ..

స్వచ్ఛదనం...పచ్చదనం కార్యక్రమాలపై కలెక్టర్ ఏ రోజుకు ఆరోజు సమీక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా అధికారులను అప్రమత్తం చేస్తారు. పంచాయతీ కార్యదర్శి, ఆశాకార్యకర్త, మరో ముగ్గురు అధికారులతో కూడిన బృందం గ్రామ స్థాయిలో కార్యక్రమ అమలుకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. గ్రామాల్లో జరుగు తున్న పనులకు సంబంధించిన నివేదికను పంచాయతీ ప్రత్యేకాధికారి, జిల్లా అధికారు లకు ఎప్పటికప్పుడు పంపించాల్సి ఉంటుంది. పట్టణ స్థాయిలో చేపట్టే కార్యక్రమాల నివేదికలను కలెక్టర్‌కు ప్రత్యేకాధికారి, వార్డు అధికారులు అందించనున్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలకం

ఎస్పీ అశోక్‌కుమార్



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలరూరల్, ఆగస్టు 3 : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని టవర్ సర్కిల్ వద్ద రూ. 5లక్షలతో ఏర్పాటు చేసిన 64 సీసీ కెమెరాలను డా క్టర్స్ అసోసియేషన్ మెడికల్‌షాప్ ఓనర్స్, స్థానిక వ్యాపారులతో కలిసి ఎస్పీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సీసీ కెమె రాల ఏర్పాటుకు ముందుకు రావడం ద్వారానే నేర రహిత సమాజ నిర్మాణం సాధ్యమని, నేరాల నియంత్రణ, శాంతి భద్రతలు కాపాడేందుకు సీసీ కెమెరా లు ఎంతగానో దోహదపడుతాయన్నారు. సీసీ కెమెరాలతో దొంగతనాలు నివా రించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. సీసీ కెమెరాల ద్వారా సేకరించిన సాక్ష్యాల ద్వారా నేరస్థుడు పాల్పడిన నేరాన్ని కోర్టు నిరూపించవచ్చని అన్నారు. ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంలో సహాయసహకారాలు అందించిన డాక్టర్స్ అసోసియేషన్స్, మెడికల్ షాప్ ఓనర్స్, వ్యాపారులను ఎస్పీ సన్మానిం చి అభినందించారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ రఘుచందర్, టౌన్ సీఐ వేణుగో పాల్, ఎస్.ఐలు స్థానికవ్యాపారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు ప్రభుత్వ భూములు రక్షించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఇతర అధికారులు

జగిత్యాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేసి ప్రభుత్వ భూములు రక్షించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆ దేశించారు. శనివారం హైద్రాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2025 మార్చి మాసాంతంలోపు ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. న్యాయబద్ధంగా ఉన్న దరఖాస్తుల ను రెగ్యులరైజ్ చేయాలన్నారు. సామన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. నా లుగు దశలలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలన్నారు. పలు అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పట్టణంలోని సమీకృత కలెక్టరే ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ సత్య ప్రసా ద్, అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతమ్‌రెడ్డి, డీపీఓ రఘువరన్, మున్సి పల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో 'రామకృష్ణ' ప్రభంజనం

జగిత్యాల అర్బన్, జూలై 3: శాతవాహన యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ 2వ, 4వ, మరియు 6వ సెమిస్టర్ ఫలితాల్లో రామకృష్ణ విద్యాసంస్థల వి ద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ యా ద రామకృష్ణ తెలిపారు. జిల్లాలోనే తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలి తాలు సాధించి ప్రతిభను కనబర్చారన్నారు. బీఎస్సీ విభాగంలో ఉమేహా హాని 9.26, సింగం సౌమ్య 9.19, బత్తుల శరణ్ 9.17, పాము సౌమిక 9.13, కోయ ల్కార్ కీర్తన 9.02, చందనగిరి అర్చన 8.90, ఇషా 8.47, బీకాం విభాగంలో అజయ్ 9.0, మహ్మద్ అష్రఫ్ 8.9, బీబీఏ విభాగంలో సానియా తబస్సుమ్ 8.3 జీపీఏ సాధించారన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్ రామకృష్ణ, డైరెక్టర్ పల్లెర్ల నరేష్, ప్రిన్సిపాల్ రాజేందర్, వెంకట రమేష్ అభినందించారు.

రేపటి ప్రజావాణి రద్దు

జగిత్యాలరూరల్, ఆగస్టు 3 : జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఆగస్టు 5 తేదీ న జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా అధికారులు కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నందున ఈ మేరకు ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దుచేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఫిర్యా దుదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

ఎస్సారెస్పీ నీళ్లు ఇవ్వకుంటే రైతుల పక్షాన ఉద్యమిస్తాం

జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్



ఎస్సారెస్పీ కెనాల్‌ను పరిశీలిస్తున్న జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత

రాయికల్, ఆగస్టు 3: రైతులకు అందాల్సిన ఎస్సారెస్పీ నీరు అందిం చకుండా నిర్లక్ష్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వెనువెంటనే ఎస్సారెస్పీ నీటి ని విడుదల చేసి రైతులకు అండగా నిలవాలని మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. రాయికల్ మండలంలోని సింగర్రావుపేట, శ్రీరాంనగర్, అల్లీపూర్, కిష్టంపేట, ఉప్పుమడుగు, అయోధ్య, కుర్మపల్లె గ్రామాల్లో పరిధికి సంబంధించిన ఎస్సారెస్పీ కెనాల్‌ను మాజీ మార్క్ ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డితో కలిసి పరిశీలించారు. ఎస్సారెస్పీ కెనాల్ నిర్వహణ అధ్వానంగా మారిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నీటి ని జూన్‌లోనే విడుదల చేసిన సంగతిని గుర్తు చేశారు. ప్రస్తుతం రైతు ల గొంతు ఎండిపోతుందని, వెంటనే నీటిని విడుదల చేయాలనికి ప్ర భుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో ఎ మ్మెల్సీ, ఎమ్మెల్యేలు ఉండి కూడా రైతు సమస్యలు పట్టకపోవడం విచా రకరమని అన్నారు. ఎస్సారెస్పీ నీళ్లు విడుదల చేయకుంటే జిల్లా రైతుల పక్షాన ఉద్యమిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పీ లావుడ్య సంధ్యారాణి, మహిళా అధ్యక్షురాలు స్పందన, పీఏసీఎస్ చైర్మన్ రాజలింగం, గ్రామ శాఖ అధ్యక్షుడు రత్నాకర్ రావు, పట్టణ అధ్యక్షుడు అనిల్, మండల మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వర్ రావు, మాజీ ఎంపీటీసీలు నాగరాజు, మోర విజయలక్ష్మి, వెంకటేష్, కౌన్సిలర్ శ్రీధర్ రెడ్డి, మహేష్ గౌడ్, సువర్ణసత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు ఉదయశ్రీ, నాగేశ్వర్ రావు, వైస్ చైర్మన్ బర్కం మల్లేష్, మాజీ ఉప సర్పంచ్ సాగర్ రావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు స్నేహితుల దినోత్సవం



జగిత్యాలలో ఫ్రెండ్‌షిప్‌డే ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

జగిత్యాల అర్బన్, జూలై 3: పట్టణంలోని స్థానిక జ్యోతి బిల్డింగ్ ప్లే బ్లాక్ ప్లే స్కూల్‌లో ముందస్తు స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. తమ స్నేహితులకు ఫ్రెండ్ షిప్ డే బాండ్ లు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఫ్రెం డ్ షిప్ డే ఆకృతిలో కూర్చుని విద్యార్థులు అబ్బుర పరిచారు. పాఠశాల డైరెక్టర్ హరిచరణ్‌రావు, శ్రీధర్ రావు, మౌనికరావు, అజితరావు, రజితరావుతో పా టు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో ముందస్తు స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టుకుని వేడుకలు నిర్వ హించారు. స్నేహానికి ఉన్న ఔన్న త్యం, స్నేహ బంధం గురించి వి ద్యార్థులకు వివరించారు. పాఠశా ల డైరెక్టర్లు మచ్చ లలిత, విద్యా స్వేష్, ఉపాధ్యాయులు రంజిత్, మహేష్, సంజన, శృతి, మనీషా పాల్గొన్నారు.

వెల్గటూర్: మండలంలోని పా షిగామ ప్రభుత్వ ప్రాథమిక పాఠ శాల, వెల్గటూర్ విజ్ఞాన్ కిడ్స్ పాఠ శాలల్లో శనివారం ముందస్తు ఫ్రెండ్ షిప్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఒకరి కొకరు ఫ్రెండ్ షిప్ బ్యాండ్‌లు క ట్టుకొని శుభాకాం క్షలు తెలుపుకు న్నారు. ఈ సందర్భంగా ప్రధానో పాధ్యాయులు నీలం సంపత్, దొరిశెట్టి మల్లేశంలు చి న్నారులకు ఫ్రెండ్‌షిప్ ప్రాముఖ్యాన్ని వివరిం చా రు. జీవితంలో వెలకట్ట లేనిది స్నేహమని ఎలాంటి సందర్భం లోనైనా స్నేహితులను దూరం చే సుకోవద్దన్నారు. ఆపద సమయం లో కూడా స్నేహితులతో కలిసి మె లిసి ఉండాలని సూచించారు. అనం తరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, అంగన్‌వాడీ టీచర్ రాజే శ్వరి, జ్యోతి, రామక్క పాల్గొన్నారు.

మల్యాల: మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల ఆల్ఫో ర్స్ ఎస్ఎస్‌వీ స్కూల్‌లో శనివారం ముందస్తు స్నే హితుల దినోత్సవ వేడుక లను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫ్రెండ్‌షిప్ బాండ్స్ కట్టు కుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విద్యార్థులకు ఫ్రెండ్‌షిప్‌డే గురించి ఉపాధ్యాయులు తెలిపారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేంద ర్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మల్యాల అల్ఫోర్స్‌లో ఫ్రెండ్‌షిప్‌డే వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థులు

అర్చక సంఘం ఆత్మీయ సమ్మేళనం

తిమ్మాపూర్, ఆగస్టు3: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల శ్రీ తాపాల లక్ష్మినరసింహ స్వామి ఆలయ ఆవరణలో శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరునగరి వెంకటాద్రి ఆధ్వర్యంలో జరుగగా ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు వింజమూరి సుధాకర్ పాల్గొన్నారు. అర్చకుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గల్ఫ్‌లో మల్లారెడ్డిపేట వాసి మృతి

● దుబాయ్‌లో పనిలేక ఆర్థిక ఇబ్బందులు
● స్వగ్రామానికి మృతదేహం

గంభీరావుపేట, ఆగస్టు 3: మండలంలోని మల్లారెడ్డిపేటకు చెందిన గెరి గంటి అంజయ్య(55) దుబాయిలో 45 రోజుల క్రితం మృతి చెందాడు. మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరింది. ఆరేళ్ల కిందట కూతురు పెళ్లి చేసిన అంజయ్య అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చేందుకు అంజయ్య దుబాయి వెళ్లి ఓ కంపెనీలో పనికి కుదిరాడు. కొద్ది రోజులకే ఆ కంపెనీ మూసివేయడంతో రోడ్డున పడ్డాడు. అక్కడ పనిలేక, అప్పులు తీర్చే మార్గం లేక మానసిక ఆందోళనకు గురయ్యాడు. చేద్దామంటే పనిలేక ఎవరూ పట్టించుకోకపోవడంతో దొరికిన నాడు తింటూ దొరకని నాడు పస్తులుంటూ వచ్చాడు. దీంతో సరిగ్గా ఆహారం లేక అనారోగ్యం పాలయ్యాడు. రోజురోజుకు గల్ఫ్‌లో అంజయ్య ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. చివరికి ఫుట్‌పాత్‌పైనే అంజయ్య తుదిశ్వాస విడిచాడు. పాస్‌పోర్ట్ కంపెనీ యాజమాన్య వద్దే ఉండిపోవడంతో మృతదేహం స్వదేశానికి తీసుకురావడానికి ఇబ్బంది ఏర్పడింది.

స్థానిక నాయకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందిం చిన ఆయన ఇండియన్ ఎంబసీ లెటర్ పంపించడంతో గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి చొరవతో శనివారం అంజయ్య మృతదేహం స్వగ్రామమైన మల్లారెడ్డిపేటకు చేరింది. అంజయ్య మృతదేహం ఇంటికి చేరగానే భార్య, వారి బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య, కూతురు ఉంది.



అంజయ్య (ఫైల్)

వెల్దిలో జిలిటెన్ స్టిక్స్ పట్టివేత

మానకొండూర్, ఆగస్టు 3: అక్రమంగా తరలిస్తున్న జిలిటెన్ స్టిక్స్‌ను వెల్ది గ్రామంలో పట్టుకున్నట్లు సీఐ సదన్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కొరిటికల్ గ్రామానికి చెందిన ఒర్సు శ్రీనివాస్ అనే వ్యక్తి కొంతకాలంగా వీణవంక మండల కేంద్రంలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం వీణవంక నుంచి మండలంలోని వెల్ది గ్రామానికి 200 జిలిటెన్‌స్టిక్స్‌ను తరలిస్తున్నాడు. వాహనాల తనిఖీలో పట్టుకుని విచారించగా శంకరపట్నం మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన వంగ సత్యనారాయణ, హుజురాబాద్ మండలంలోని ఇప్పల నర్సింగాపూర్‌కు చెందిన జున్నోజు రాజేందర్‌ల వద్ద వాటిని కొనుగోలు చేసినట్లు శ్రీనివాస్ తెలిపాడని తెలిపారు.ఈ సంఘటనలో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, రామడుగు, బోయినపల్లి, ఆగస్టు 3: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టులోకి 8,355 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, ప్రాజెక్టు నుంచి నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరు రిజర్వాయర్‌లోకి నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఇప్పటి వరకు 8.5 టీఎంసీల నీటిని మిడ్‌మానేరుకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.125 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 12600 క్యూసెక్కులు, మానేరు, ములవాగు ద్వారా 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 27.5 టీఎంసీలకు ప్రస్తుతం 14.347 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

● ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.



రామడుగు వద్ద నిండుగా ప్రవహిస్తున్న గ్రావిటీ కెనాల్

శనివారం రాత్రి వరకు ఎస్సారెస్పీలోకి 17,925 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 43.091 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1 నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 37.352 టీఎంసీల నీరు వచ్చి చేరింది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 3: సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్‌కు చెందిన నందగిరి రాజశేఖర్ (31) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. హైద్రాబాద్‌లోని మియాపూర్‌లో గల ఓ లాడ్జ్‌లో శుక్రవారం రాత్రి రాజశేఖర్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోనరావుపేట మండలంలోని పల్లిమక్తకు చెందిన రాజశేఖర్ కుటుంబం ఉపాధికోసం సిరిసిల్లకు వలసవచ్చారు. సిరిసిల్లలోని గీతానగర్‌లో నివాసం ఉన్న రాజశేఖర్ తండ్రి గతంలోనే మృతిచెందాడు. హైద్రాబాద్‌లోని హైటెక్ సిటీలో గల ఓ కంపెనీలో రాజశేఖర్ ఎనమిదేళ్లుగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేశాడు. కొంత కాలంగా నెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న రాజశేఖర్ దాదాపు రూ.40లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హైద్రాబాద్‌కు తరలివెళ్లారు. రెండు నెలల క్రితం సాఫ్‌వేర్ ఉద్యోగం మానేసిన రాజశేఖర్ అప్పులపాలు కావడంతో మనస్థాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డాడని మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మృతుడి తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియల కోసం మృతుడి అమ్మమ్మ స్వగ్రామమైన తంగళ్లపల్లి మండలంలోని తాడూరు గ్రామానికి తరలించారు.

ఖనిలో ఆంబోతుల వీరంగం

● టీవీ షోరూంలోకి దూసుకెళ్లిన ఎద్దులు



గోదావరిఖని లక్ష్మీనగర్‌లో పొట్లాటకు దిగిన ఆంబోతులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 3: గోదావరిఖనిలో జనం రద్దీ ఉండే ప్రదేశంలోనే ఎద్దులు పొట్లాటకు దిగుతుండడంతో అమాయకుల కాళ్లు, చేతులు విరుగుతున్నాయి. శనివారం నిత్యం రద్దీగా ఉండే గోదావరిఖని లక్ష్మీనగర్‌లో గంట పాటు ఆంబోతులు కొట్లాటకు దిగడంతో రెండు ఎలక్ట్రికల్ షాపులు, ఓ టీవీ షోరూమ్‌లో వస్తువులు, రోడ్లపై ఉన్న పలు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ప్రజలపై ఆంబోతులు దూసుకురావడంతో పరుగులు తీశారు. అక్కడ ఉన్న వారు వాటిని వెళ్లగొట్టేందుకు ప్రయత్నం చేసినప్పటికీ అవి ఎంతకూ అక్కడి నుంచి వెళ్లిపోలేదు. ఓ టీషాపులోకి దూరి టీవీలను, ఫ్రిజ్‌లను ధ్వంసం చేశాయి. పశువుల భారి నుంచి కాపాడాలని ఎన్నిసార్లు కార్పొరేషన్ అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదని వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఏదో ఒక చోట పశువులు కొట్లాటకు దిగుతుండడంతో పలువురి కాళ్లు చేతులు కూడా విరిగిపోయిన ఘటనలు గోదావరిఖనిలో ఉన్నాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవాలని ప్రజలు, వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భర్త కాపురానికి తీసుకెళ్లాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న రుచిత కుటుంబ సభ్యులు, బంధువులు

కోరుట్ల రూరల్, ఆగస్టు 3: తనను కాపురానికి తీసుకెళ్లాలని మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో భర్త ఇంటి వద్ద భార్యతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామానికి చెందిన రుచితకు కోరుట్ల మండల గుమ్లాపూర్‌కు చెందిన బోయిన రమణతో 2024, ఫిబ్రవరి 14న వివాహం జరిగింది. భార్యపై అనుమానంతో రుచితను తన భర్త వేంపేటలోని పుట్టింట్లో వదిలి వెళ్లాడు. రుచిత తల్లిదండ్రులు పలుమార్లు కుల సంఘ పెద్దలతో పంచాయతీలు నిర్వహించి సముదాయించారు. దంపతులిద్దరినీ ఆసుపత్రిలో చూపించి వైద్యులతోనూ చెప్పించారు. చివరకు మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో రమణను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి రుచితను కాపురానికి తీసుకెళ్లడానికి ఒప్పించారు. రోజులు గడుస్తున్నా కాపురానికి తీసుకెళ్లకపోవడంతో శనివారం రుచితతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో గుమ్లాపూర్‌కు తరలి వచ్చి అత్తింటి ఎదుట భైఠాయించారు. సమాచారం తెలుసుకున్న రమణ అతని కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న కోరుట్ల 2వ ఎస్ఐ ఆరీఫ్ ఖాన్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో రుచిత బంధువులు ఆందోళన విరమించారు. కాగా పోలీసుస్టేషన్‌లో రాత్రి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంపై ఏసీబీ దాడి

- అధికారులకు చిక్కిన తహసీల్దార్, డ్రైవర్, తాత్కాలిక ఉద్యోగి

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 3: పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. తహసీల్దార్ జాహెద్‌పాషాతో పాటు లంచం తీసుకుంటుండగా పట్టుబడిన డ్రైవర్ మహమ్మద్ అమ్జద్‌పాషా, తాత్కాలిక ఉద్యోగి దాసరి ధర్మేందర్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. ఓదెల మండలం చిన్నకొమిరె గ్రామానికి చెందిన కడెం తిరుపతికి కాల్వశ్రీరాంపూర్ మండలం పందిళ్ల గ్రామ శివారు సర్వే నంబర్ 645లో 28గుంటల భూమి ఉంది. బ్యాంకు లోన్ కోసం పహాణి నకల్ అవసరం కావడంతో రూ.10 వేలు ఇవ్వాలని తహసీల్దార్ డిమాండ్ చేశాడు. ఈ విషయమై తిరుపతి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తాత్కాలిక ఉద్యోగి దాసరి ధర్మేందర్, డ్రైవర్ అమ్జద్‌పాషా తిరుపతి నుంచి రూ. 10 వేలు తీసుకుంటుండగా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. దాసరి ధర్మేందర్‌తో పాటు తహసీల్దార్ జహెద్‌పాషా, డ్రైవర్ మహమ్మద్ అమ్జద్‌పాషాలను అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు. తిరుపతి తండ్రి



ఏసీబీకి చిక్కిన దాసరి ధర్మేందర్, తహసీల్దార్ జాహెద్‌పాషా, అమ్జద్‌పాషా

పేరు మీద ఉన్న భూమిని విరాసత్ చేసేందుకు దాసరి ధర్మేందర్, అమ్జద్ పాషాల ద్వారా రూ.50వేలు లంచం తీసుకున్న తహసీల్దార్ జాహెద్‌పాషా గత నెల 23న మ్యుటేషన్ చేశాడని తెలిపారు. ఇటీవల మ్యుటేషన్ కావడంతో బ్యాంకు లోన్ కోసం డాక్యుమెంట్లు, పహాణి నకలు మ్యాన్యువల్‌గా ఇవ్వాల్సి ఉన్నందున తహసీల్దార్ లంచం డిమాండ్ చేశాడన్నారు. దాసరి ధర్మేందర్, అమ్జద్‌పాషాల వాంగ్మూలం మేరకు తహసీల్దార్‌నుఅరెస్టు చేశామని తెలిపారు.

పాముకాటుతో ఒకరి మృతి

గన్నేరువరం, ఆగస్టు 3, మండలంలోని పారువెల్ల గ్రామానికి చెందిన గోకులకొండ రాజేశం(68) శుక్రవారం మధ్యాహ్నం తన ఇంటి వద్ద పాముకాటుకు గురై కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపారు. మృతుడి కుమారుడు తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

గన్నేరువరం, ఆగస్టు 3: మండలంలోని చీమలకుంటపల్లి గ్రామానికి చెందిన పొలవేని వీరయ్య(78) అనారోగ్యం కారణంగా ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం. మృతుడు గతంలో చెట్టుపై నుంచి పడి వెన్నుముఖకు దెబ్బ తగలడంతో అనారోగ్యానికి గురై ఇంట్లోనే ఉంటున్నాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో మనస్థాపానికి గురైన వీరయ్య శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

చిరుత దాడిలో రెండు ఆవులు మృతి

గంబీరావుపేట, ఆగస్ట్ 3 : గంబీరావుపేట మండలం గోరంటాల గ్రామ సమీప అడవుల్లోరి మెట్టె ఒర్రె ప్రాంతంలో శుక్రవారం రాత్రి రెండు ఆవులపై చిరుత పులి దాడి చేసింది. గోరంటాలకు చెందిన చంద్రం అనే రైతుకు చెందిన రెండు ఆవులను తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న కొట్టంలో కట్టేశాడు. శుక్రవారం రాత్రి కొట్టంలో ఉన్న రెండు ఆవులపై రుత దాడి చేసి చంపేసింది. ఉదయం ఎప్పటిలాగానే రైతు తన పొలం వద్దఉన్న కొట్టం వద్దకు వ్చ చూసే సరికి రెండు ఆవులు గాయాలతో చనిపోయి ఉన్నాయి. వెంటనే గ్రామస్తులకు చెప్పడంతో వారు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ డిప్యూటి రేంజ్ ఆఫీసర్ అంజలి, బీట్ ఆఫీసర్ రమేష్‌లు సంఘటన వద్దకు చేరుకుని పరిశీలించారు. చిరుత పులి దాడి వల్లే ఆవులు చనిపోయాయని ఫారెస్ట్ అధికారులు నిర్ధారించారు.

అడవిపిల్లి దాడిలో లేగ దూడ మృతి

చందుర్తి: మండలంలోని దేవుని తండాలో ఎర్ర చెరువు ప్రాంతంలో పశువుల పాకలో శుక్రవారం రాత్రి జంగిల్ క్యాట్ (జిత్రపులి) దాడిలో లేగ దూడ మృతి చెందింది. వట్టిమల్ల ఎఫ్ఎస్ఓ అన్వర్ హుస్సేన్ కథనం ప్రకారం.. సరిలాల్ అనే రైతు రోజు మాదిరిగానే లేగ దూడను పశువుల పాకలోకి తోలి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం పశువుల పాకకు వెళ్లి చూడగా లేగదూడ మృతి చెంది ఉన్నది. దూడ మృతి చెందిన విషయం అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దాడి చేసింది.. చిరుత పులి కాదని జంగల్ క్యాట్ (జిత్రపులి) దాడిలోనే దూడ మృతి చెందిందని తెలిపారు.

రేపటి నుంచి శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం

ధర్మపురి, ఆగస్టు 3: ధర్మపురి క్షేత్రంలో ఈ నెల 5న సోమవారం నుంచి శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. నెల రోజుల పాటు సుదూర ప్రాంతాల నుంచి నిత్యం అనేక మంది భక్తులు క్షేత్రానికి చేరుకుంటారు. క్షేత్రంలో లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ దేవాలయాలు, పురాతన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాలు ఉన్నాయి. క్షేత్ర సమీపంలో పురాతన శ్రీ అక్కపల్లి రాజ రాజేశ్వర స్వామి ఆలయం ఉంది. గోదావరి నదీ తీరాన గోదావరి మాత, సంతోషీమాత, పురాతన మహాలక్ష్మి, శివ సాయి బాలాజీ, శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయాలు ఉన్నాయి. శ్రావణ మాసంలో నిత్యం వివిధ ప్రాంతాల నుంచి చేరుకునే భక్తులు గోదావరిలో స్నానాలు చేసిన అనంతరం ప్రత్యేకంగా నది పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకుంటారు. నవదంపతులు జలప్రియుడు అయిన చిన్న గద్దె శివుడికి జలంతో అభిషేకం చేసి పూజిస్తారు. భక్తులు శ్రీ లక్ష్మీ నరసింహ, శ్రీ రామ లింగేశ్వర, శ్రీ అక్కపల్లి రాజ రాజేశ్వర స్వామి వారలను దర్శించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మాసంలో వచ్చే నాగుల పంచమి నాడు పాము పుట్టల్లో పాలు పోసి రాఖీ పౌర్ణమి రో జున యజ్ఞోపవీతధారణ జరిపి అనేక మంది భక్తులు శ్రీ సత్యనారా యణ స్వామి వ్రతాలు ఆచరిస్తారు. నెల రోజుల పాటు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్రీ లక్ష్మీ నరసింహుని ఆలయంలో పూజలు

శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ప్రధాన దేవాలయంలో స్వామి వారికి నెల రోజుల పాటు ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. భక్తులు రూ.2,516 చెల్లిస్తే వారి పేరట నెల రోజుల పాటు అభిషేకం, పూజలు, సంకల్పం నిర్వహిస్తారు. ఉగ్ర నారసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, ప్రత్యేక భోగములు జరిపి రూ. 2,000 చెల్లిస్తే భక్తుల పేరట నెల రోజుల పాటు అభిషేకం, భోగములు, సంకల్పం నిర్వహిస్తారు. రామ లింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు రూ 516 చెల్లిస్తే వారి పేరట నెల రోజుల పాటు అభిషేకం నిర్వహిస్తారు.

అమెరికా ఫెలోషిప్‌నకు వీణవంక విద్యార్థిని ఎంపిక

వీణవంక,ఆగస్టు3:అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించడనికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున వ్యవసాయ విద్యలో ప్రతిభావంతులైన నలుగరు విద్యార్థులను ఫెలోషిప్‌కు నలుగురిని ఎంపిక చేశారు. అందులో వీణవంక మండలం మామిడాలపల్లి గ్రామానికి చెందిన మూల పావని ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల మాస్టర్స్ చదువులకు అయ్యే పూర్తి ఖర్చు భరిస్తుంది.ప్రతి విద్యార్థికి 55.50 లక్షల చొప్పున నలుగురికి 2.22 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను తల్లిదండ్రులను అభినందించారు. పావని కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేసింది. 2025-26 సంవత్సరంలో అమెరికాలో అబ్రమ్ యూని వర్సిటీ అలబామలో వారు మాస్టర్స్ పూర్తి చేస్తారని తెలిపారు. 2023-24, 2024-2025లలో డిగ్రి పూర్తి చేసిన బ్యాచ్‌కు ఇద్దరు చొప్పున ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పలువురు అభినందించారు.



ఫెలోషిప్‌నకు ఎంపికైన పావని

వ్యవసాయ కార్మిక సంక్షేమ చట్టం అమలు చేయాలి

● వ్యవసాయ కూలీలకు రూ. 12 వేల భృతి చెల్లించాలి ● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

వేములవాడ టౌన్, ఆగస్టు 3 : రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులకు, గ్రామీణ కూలీలకు సమగ్ర సంక్షేమ చట్టం అమలు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలో జరుగుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను చాడ వెంకట్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు కోసం కృషి చేయాలని, అందులో భాగంగానే వ్యవసాయ కూలీలకు రూ. 12 వేల భృతి చెల్లించాలని అన్నారు. ఆసరా పెన్షన్ ఇవ్వాలని, గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించి, రోజు పనిచేసే కూలీలకు రూ. 700 చెల్లించాలని, ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులతో పాటు సమ్మర్ అలవెన్స్ వెంటనే విడుదల చేయాలని, మున్సిపాలిటీలలో కూడా ఉపాధి హామీ పథకం అమలు చేయాలని అన్నారు. గ్రామాల్లో చాలా సంవత్సరాలుగా ప్రభుత్వాలు ఇళ్ల మంజూరు చేయకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మించి వున్న ఇళ్లను వెంటనే అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని అన్నారు. ప్రస్తుత పాలకులు వ్యవసాయ కూలీలకు, గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కూలీబంధు పథకం అమలు చేయాలని, ఎన్నికల గ్యారంటీలలో భాగంగా ఇళ్లు లేని పేదలకు గృహజ్యోతి పథకం కింద రూ.5 లక్షలు ఇవ్వడమే కాకుండా ఇంటి స్థలం లేని వారికి స్థలం ఇచ్చి రూ.6 లక్షలు ఇవ్వాలని కోరారు. గ్రామీణ



వేములవాడ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

ప్రాంతాల్లో వున్న సాగు భూమి లేని వ్యవసాయ కూలీలకు, గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వ భూములను పంపిణీ చేయాలని లేని పక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ భూములు ఆక్రమణ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ శిక్షణ తరగతులలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కాంతయ్య, నక్క బాలమల్లేష్, రాష్ట్ర నాయకులు కొయ్యాడ సృజన్‌కుమార్, తాటి వెంకటేశ్వర్లు, జంగయ్య, యేసు, లింగారెడ్డి, ఎగుర్ల మల్లేశం, గుంటి వేణు, కడారి రాములు తదితరులు ఉన్నారు.

నకిలీ నోట్ల ముఠా అరెస్ట్

● రూ. 7 లక్షల నకిలీ కరెన్సీ, కారు స్వాధీనం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 3 (మెట్‌పల్లి): తక్కువ మొత్తం అసలు కరెన్సీ ఇస్తే ఎక్కువ మొత్తంలో నకిలీ కరెన్సీ ఇస్తామంటూ ఎర వేసి తీరా అసలు కరెన్సీతో పారిపోయి జల్సాలకు అలవాటు పడ్డ ఆరుగురు ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వరరావు తెలిపారు. శనివారం పట్టణంలో డీఎస్పీ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా తాళ్ల ధర్మారానికి చెందిన సంజీవ్, జగిత్యాల పట్టణానికి చెందిన శివకుమార్, నిర్మల్ జిల్లాకు చెందిన కిషన్, మల్లయ్య, గంగారం, అశోక్ అనే ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 7 లక్షల నకిలీ కరెన్సీ, ఒక కారు, ద్విచక్ర వాహనం, 6 సెల్‌ఫోన్‌లు, 5,050 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముఠా సంవత్సరకాలంగా ఇద్దరు చొప్పున ఒక ముఠాగా ఏర్పడి హైద్రాబాద్‌లో ముగ్గురిని, ధర్మపురిలో ఒకరిని, కరీంనగర్‌లో ఒకరిని, జన్నారంలో ఒకరిని, జగిత్యాలలో ఒకరి వద్ద నుంచి డబ్బులు కాజేశారు. లక్ష అసలు కరెన్సీకి రూ.4 లక్షలు నకిలీ నోట్లు ఇస్తామని వల వేశారు. ఇలా వల వేసి అక్కడకు వెళ్లిన తర్వాత సదరు వ్యక్తికి బ్యాగులో 4 లక్షల వరకు నకిలీ నోట్లను చూపి అతని వద్ద ఉన్న ఒరిజినల్ లక్ష తీసుకున్న తర్వాత పరారవుతూ మోసాలకు పాల్పడేవారని తెలిపారు. ఈ వ్యవహారంలో మొత్తం 10 లక్షల వరకు నిందితులు లాక్కొని పరారీలో ఉన్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న ముఠా సభ్యులు ఈ నెల 1న పట్టణ శివారులోని పెద్ద గుండు వద్ద స్థానిక దాబా యాజమాని వద్ద నుంచి లక్ష లాక్కొని పరారయ్యారు. యాజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి, రాజు గాలింపు చర్యలో భాగంగా శనివారం పట్టణంలోని వెంకట్రావుపేట దాబాలో గుర్తించి ఆరుగురిని అదుపులోకి తీసుకుని రిమాండుకు తరలించినట్లు తెలిపారు. నకిలీ నోట్ల ముఠాను పట్టుకోవడంలో చాకచాక్యంగా వ్యవహరించిన సీఐ నిరంజన్‌రెడ్డిని, ఎస్ఐ చిరంజీవిని, రాజు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ అభినందించారు.



మాట్లాడుతున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వర్‌రావు

పీఎం కిసాన్ జాబితా పేరిట లింకులు

● జోరుగా సైబర్ మెసేజ్‌లు

కరీంనగర్ రూరల్, ఆగస్టు3: కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూర్ గ్రామంలో రెండు రోజులుగా సైబర్ మోసగాళ్ల నుంచి వస్తున్న వాట్సప్ మెసేజ్‌లు చూసి కంగుతింటున్నారు. రెండు రోజుల క్రితం నగునూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి పీఎం కిసాన్ లిస్ట్1 పేరుతో ఒక వాట్సప్ మెసేజ్ వచ్చింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈ జాబితాలో తమ పేరు చూసుకోవడానికి అతడు మెసేజ్‌ను ఓపెన్ చేశాడు. అది ఓపెన్ కాక ఇన్‌స్టాల్ అడగటంతో దాన్ని ఇన్‌స్టాల్ చేశాడు. దీంతో వెంటనే ఫోన్ వాట్సప్ కనబడకుండా పోయిందని బాధితుడు తెలిపాడు. అయితే అతడికి ఫ్లిప్‌కార్ట్ నుంచి బ్యాంకుల ఫోన్ పే ఓటీపీ నంబర్ కావాలని మెసేజ్ రావడంతో అనుమానం వచ్చిన అతను ఓటీపీ ఓపెన్ చేయలేదు. కానీ అతని ఫోన్ నెంబర్ నుంచి ఇతర వ్యక్తులకు, గ్రూపునకు అతని ప్రమేయం లేకుండానే మెసేజ్‌లు పోవడం గమనించారు. విషయం తెలుసుకున్న ఆ గ్రూప్ అడ్మిన్ అతన్ని తొలగించినా గ్రూప్‌లో ఉన్న వ్యక్తులకు మెసేజ్‌లు రావడం మొదలైంది. దాదాపు ఆగ్రూప్‌లో 250మంది ఉన్నారు. మొదటగా ఆ గ్రూప్‌లో ఆ మెసేజ్ పెట్టిన వ్యక్తి పేరిట కొంతమందికి ఇంకా మెసేజ్‌లు వస్తున్నాయి. కొంత మందికి ఓటీపీలు రావడం మరికొందరికి ఫోన్లు రావడంతో గ్రామంలో పలువురు ఆందోళన చెందుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

రాయికల్, ఆగస్టు 3: పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అన్నారు. రాయికల్ మండలంలో ప్రజా చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు చింతకుంట సాయి కుమార్ అధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తూ కోతులు జనంలోకి వస్తూ, ఆకలితో అలమటిస్తూ, అడవిలో ఉండాల్సిన జంతులు జనంలోకి రావడంతో వాటితో పాటు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పండ్ల మొక్కల విత్తనాలతో సీడ్ బాల్స్‌ను తయారు చేయగా, వాటిని కట్కాపూర్, తాట్లవాయి పరిధిలో గల వెన్నెముద్దల గండి అటవీ ప్రాంతంలో వెదజల్లే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాయికల్ ప్రెస్ క్లబ్ జేఏసీ అధ్యక్షుడు వాసరి రవి, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల జగదీ శ్వర్, చింతకుంట సాయి కుమార్, ఇమ్మడి విజయ్ కుమార్, యాచమనేని కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల మాటలకు మోసపోవద్దు

కొడిమ్యాల, ఆగస్టు 3: సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దని కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని రామకిష్టాపూర్ గ్రామంలో సైబర్ మోసాలపై ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలతో సామాజిక అంశాలపై పోలీస్ కళా బృందం సభ్యులు పాటలతో ప్రజలకు అవగాహన కలిపించారు. ఎస్సై మాట్లాడుతూసైబర్ మోసాలకు గురైతే 1930 నెంబరుకు డయల్ చేయాలన్నారు. సీసీ కెమెరాల, హెల్మెట్ ఆవశ్యకతను, ట్రాఫిక్ నియమాలు, గంజాయి, మూఢనమ్మకాలు, గల్ఫ్ ఏజెంట్ల మోసాలు నివారణపై అవగాహన కలిపించారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే 100 డయల్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ సభలో పీసీలు తిర్మల్, శ్రీకాంత్, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్



తాగునీటిని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

జగిత్యాల అర్బన్, జూలై 3: పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్ మున్సిపల్ వాటర్ సప్లై సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ధరూర్ క్యాంప్‌లోగల ఫిల్టర్‌బెడ్‌ను శనివారం ఆమె సందర్శించారు. వాటర్‌ట్యాంక్ వద్ద ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పట్టణ పరిధిలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చైర్‌పర్సన్ వెంట ఏఈ అనిల్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

● తల్లిపాలు బిడ్డకు అమృతంలాంటివని బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. పట్టణంలోని 36వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పోషణా అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ మధు, సూపర్‌వైజర్ కవిత, అంగన్వాడీ టీచర్లు సంధ్య, జ్యోత్స్న, సౌజన్య, గాయత్రి పాల్గొన్నారు.

నివేశిత స్థలాలు సాధించే వరకు ఉద్యమిస్తాం

టీయూడబ్ల్యూజే ఐజేయూ అధ్యక్షుడు శ్రీనివాసరావు



నిరసన దీక్షలో పాల్గొన్న జర్నలిస్టులు

జగిత్యాల అర్బన్, జూలై 3: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు సాధించేవరకు ఉద్యమం ఆగదని టీయూడబ్ల్యూజే ఐజేయూ అధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ఉద్యమంలో భాగంగా ఐదు రోజులుగా వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం శనివారం నిరవధిక నిరసన దీక్షకు శ్రీకారం చుట్టారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు అధిక సంఖ్యలో దీక్షకు హాజరై విజయవంతం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేష్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లెల్లెల బాలకృష్ణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, ఎమ్మార్పీఎస్ నాయకులు గంగారాం, సతీష్ సంఘీభావం తెలిపారు.

సీఎం చేతుల మీదుగా 'సరస్వతి నమస్తుభ్యం' పుస్తకావిష్కరణ

ధర్మపురి, ఆగస్టు 3: ధర్మపురి పట్టణానికి చెందిన నూగూరి అర్చన అనే ఉత్తమ ఉపాధ్యాయురాలు, జాతీయ అవార్డు గ్రహీత సాధించిన విజయాలపై రచించిన సరస్వతి నమస్తుభ్యం పుస్తకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని రెబ్బనపెల్లి గ్రామంలో గల పాఠశాలలో పని చేస్తుండగా ఉత్తమ ఉపాధ్యాయినిగా జాతీయ స్థాయి అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకుంది. 24 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో నిబద్ధతగా నిర్వహిస్తున్న విధానం, ఆమె సాధించిన విజయాలపై అర్చన తండ్రి నూగూరి విద్యాసాగర్ సరస్వతి నమస్తుభ్యం అనే పుస్తకాన్ని రచించారు. ఎల్‌బీ స్టేడియంలో పదోన్నతులు వచ్చిన ఉపాధ్యాయుల సమ్మేళనంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సహకారంతో సీఎం రేవంత్‌రెడ్డి ఆ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ ఇంటికి వెళ్లి అర్చన ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానించారు.

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



ఎమ్మెల్యేను కలిసిన యువజన కాంగ్రెస్ అభ్యర్థి

జగిత్యాల అర్బన్, జూలై 3: అన్ని వర్గాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీరామ మందిరానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ చొరవతో టీటీడీ నుంచి రూ.10లక్షల మంజూరు చేయగా అఖిల బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను క్వార్టర్స్‌లో కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జగిత్యాల టౌన్ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సుధీర్‌రావు ఎమ్మెల్యే క్వార్టర్‌లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు.

జగిత్యాల జిల్లా యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో మద్దతు కోరుతూ కాంగ్రెస్ యువజన విభాగం జిల్లా అధ్యక్ష అభ్యర్థి క్యాస సంజీవ్ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తన గెలుపునకు సహకరించాలి కోరారు. ఆయన వెంట నాయకులు సుమన్‌రావు, కత్తురోజు గిరి, ఏనుగుల రాజు తదితరులున్నారు.

తల్లి పాలు ఆరోగ్యకరం



మల్యాల మండలం రామన్నపేటలో చిన్నారులతో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు

కోరుట్ల, ఆగస్టు 3: పుట్టిన బిడ్డకు తల్లి పాలు శ్రేష్ఠమైనవని పలు వార్డులకు చెందిన కౌన్సిలర్లు ఐసీడీఎస్ అధికారులు అన్నారు. పట్టణంలోని అన్ని వార్డులలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లి వారోత్సవాలలో భాగంగా గర్భిణులకు శీమంతం జరిపి చిన్నారులకు ముర్రుపాలను అందించారు. ఈ సందర్భంగా పలు వార్డులకు చెందిన వార్డు సభ్యులు మాట్లాడారు. పుట్టిన బిడ్డ ఆరోగ్యం వంతుగా ఎదగడానికి తల్లి పాలు ఎంతో దోహదపడుతాయన్నారు. పుట్టిన బిడ్డకు తల్లి పాలు విశిష్టతపై గర్భిణులకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహకులు, వార్డు సభ్యులు, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

కథలాపూర్: తల్లి ముర్రుపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక పేర్కొన్నారు. మండలంలోని పెగ్గెర్లలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. వైద్య, ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్, సెర్ప్ అధికారులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలోని దొంతాపూర్ గ్రామంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీవాణి గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపైన అవ గాహన కల్పించారు. కార్యక్రమంలో ధర్మపురి సీడీసీవో శ్రీవాణి, పల్లె దావాఖాన డాక్టర్ దివ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుసుమ, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్స్, ఏఎన్ఎం, ఆశావర్కర్స్ పాల్గొన్నారు.

మల్లాపూర్: తల్లి పాలు బిడ్డకు అమృతం లాంటివని ఐసీడీ ఎస్ సూపర్ వైజర్ భారతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రంలో మహిళలతో అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన జరిపారు. ఈ కార్యక్రమంలో శారద, రాణి, ప్రసంతి, బాలింతలు, గర్భవతులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ సెక్టార్ పరిధిలోని పొరండ్ల-2 అంగన్ వాడీ కేంద్రంలో శనివారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ శారద మాట్లాడుతూ ప్రసవించిన ప్రతి తల్లి తమ బిడ్డకు మొదటి అరగంటలోపు వచ్చే ముర్రుపాలను తప్పనిసరిగా పట్టించాలని, దాని వల్ల బిడ్డకు ముర్రుపాలు పట్టడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంద న్నారు. ఆశవర్కర్ పద్మ, పాల్గొన్నారు.

వెల్గటూర్: మండలంలోని కుమ్మరిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో లయన్స్ క్లబ్ వెల్గటూర్ ఆధ్వర్యంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సిరిపురం తిరుపతి, సెక్రెటరీ నోముల వెంకట్‌రెడ్డిలు తల్లులకు, చిన్నారుల కు పౌష్టికాహారాన్ని అందజేశారు. ట్రెజరర్ గాదాసు రాజేందర్, హెల్త్ సూపర్ వైజర్ చంద్రకళ, ఆరోగ్య కార్యకర్తలు జయప్రద, నిర్మల, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి,ఆశకార్యకర్త సుజాత పాల్గొన్నారు.

మల్యాల: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందిన శిశువు పుట్టగానే ముర్రుపాలు తప్పకుండా పట్టించాలని అంగన్‌వాడీ టీచర్లు బాలింతలకు సూచించారు. రామన్నపేట అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అంగన్‌వాడీ టీచర్ రేణుక, ఏఎన్ఎం సుశీల, ఆశవర్కర్లు పాల్గొన్నారు

జగిత్యాలరూరల్ : శిశువులకు తల్లిపాలే శ్రేయస్కరమని జగిత్యాల జిల్లా శిశుసంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మాతాశిశుసంరక్షణ దవాఖానాలో శనివారం గర్భిణులకు, వైద్యసిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎంవోయా కూబ్‌పాషా, వైద్యులు శ్రీనివాస్, అరుణ కుమారి, గర్భిణులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపల్లి : తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కారమని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొన్నారు. శనివారం గొల్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను అంగన్‌వాడీ టీచర్లు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తాండ్ర రమాదేవి, రాధ, హేమలత, సునీత, సింగిరెడ్డి రమా, సాయిలత, సప్న, తిరుమల, రాజేశ్వరి, లక్ష్మీ, రమా తదితర అంగన్‌వాడీ టీచర్లతో పాటు ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ కార్యదర్శి మహేష్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఏఎన్ఎం జలజ, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సీఏలు పాల్గొన్నారు.

● పట్టణంలోని 6, 8న అంగన్‌వాడీ కేంద్ర పరిధిలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి ఆధ్వర్యంలో గల 8, 9, 10 అంగన్‌వాడీ కేంద్రాలు కలిసి 7 నెలల పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. ఏఎన్ఎం సరిత, అంగన్ వాడీ టీచర్లు పద్మ, ఉమాదేవి, రమాదేవి, స్వరూప, సుభద్ర, రాధిక పాల్గొన్నారు.



పెగ్గెర్లలో చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న సూపర్‌వైజర్

స్వచ్ఛదనం-పచ్చదనం నిర్వహణపై అవగాహన



మాట్లాడుతున్న కమీషనర్ తిరుపతి

కోరుట్ల, ఆగస్టు 3 : ఈ నెల 5నుంచి 9 తేదీ వరకు నిర్వహించు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతి శనివారం ఆర్‌పీ, వార్డు సిబ్బంది, హెల్త్ డిపార్మెంట్ సిబ్బందికి సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆర్‌పీ, వార్డు సిబ్బంది, ఆరోగ్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు సలహాలను అందించారు. కమిషనర్ తిరుపతి చేయాల్సిన కార్యక్రమాలను వివరించి విజయవంతం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఆర్‌పీలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి అనంద్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్‌డీవో కార్యాలయంలో 5 రోజుల పాటు నిర్వహించే కార్యాక్రమాల గురించి మండలంలోని గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులకు సూచనలు సలహాలను అందించారు. గ్రామ ప్రజలు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచి పచ్చదనంపై అవగాహన కల్పించి గ్రామస్థులను బాగస్వామ్యం అయే విధంగా చర్యలు తీసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారి నాగమణి, ఎంఈవో నరేశం, ఆర్‌డబ్ల్ ఏఈ శ్రీనివాస్, ఎంపీవో కృపాకర్, డిటి కృష్ణ, ఎపీఎం శంకర్ పాల్గొన్నారు.

కథలాపూర్: పారిశుధ్యంపై గ్రామపంచాయతీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్‌డీవో ఏపీడీ మదన్‌మోహన్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎప్పటికప్పుడు మురికి కాలువల్లో ఉన్న మట్టిని తొలగించాలని, నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి ఆయిల్ బాల్స్ వేయించాలన్నారు. పల్లెల్లో వాడవాడలా ఫాగింగ్ చేయించి దోమల వృద్ధికి అడ్డుకట్ట వేయాలన్నారు. ఎంపీడీవో శంకర్, ఏపీఎం నరహరి, ఏఈ అనిల్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కోరుట్ల రూరల్ : పారిశుధ్య పనులలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించిన ఎంపీడీవో గ్రామ పంచాయతీలోని రికార్డులను తనిఖీ నిర్వహించారు. గ్రామంలో నిర్వహింస్తున్న అంగన్‌వాడి కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడారు. గ్రామంలో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించి ప్లాస్టిక్ నియతరణపై గ్రామస్థాయి అధికారులు చర్యలు తసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, అంగన్ వాడీ టీచర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణను నిరసిస్తూ ధర్నా

మేడిపల్లి, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శాంతియుత ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. వర్గకరణపై పునరాలోచన చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు నేతలు ప్రభాకర్, గంగధర్, లక్ష్మిణ్, పోచయ్య, సాల్మాన్, నరేష్, దేవయ్య, కిషన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేను దూషించిన వ్యక్తి అరెస్ట్

మెట్‌పల్లి, (ఇబ్రహీంపట్నం): కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావులను దూషించిన వ్యక్తిని శనివారం అరెస్ట్ చేసినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మల్లాపూర్ మండలం సిరిపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రాములు కోరుట్ల ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేను దూషిస్తూ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. దీనిపై అదే గ్రామానికి చెందిన దామెర నారయణరెడ్డి ఈ నెల 1న ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి శనివారం అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. గ్రూప్ అడ్మిన్‌గా ఉన్న మాజీ సర్పంచ్ గోవింద్ నాయక్‌కు నోటీస్‌లు ఇచ్చారు.

బీరు సీసాలతో దాడి : యువకుడికి గాయాలు

జగిత్యాలరూరల్, ఆగస్టు 3 :జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామానికి చెందిన ఎర్రండి ప్రవీణ్ అనే వ్యక్తిని శనివారం నవనంది రాకేష్, బోరగల తిరుపతి, కల్లెడ వంశీ అనే యువకులు బీర్ సీసాలతో దాడిచేసి గాయపరిచి నట్లు జగిత్యాల టౌన్ ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామానికి చెందిన ఎర్రండి ప్రవీణ్ కూలీ పనిచేసుకుంటూ జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్నాడు. శనివారం మద్యం సేవించుటకోసం ఉదయం 11 గంటల ప్రాంతంలో బాలాజీబార్‌కు వెళ్లాడు. ప్రవీణ్ మద్యం సేవిస్తున్న క్రమంలో బార్‌లో రాకేష్, తిరుపతి, వంశీ అనే వ్యక్తులతో గొడవ జరిగింది. ఇది మనసులో పెట్టుకొని ప్రవీణ్‌ను చంపుతామని బెదిరించి రాకేష్ తన వెంట తెచ్చుకున్న బీర్‌సీసాతో ప్రవీణ్‌పై దాడి చేశాడు. దీంతో ప్రవీణ్‌కు తీవ్రరక్తస్రావంకాగా జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రవీణ్ తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అలరించిన విద్యార్థుల ఆటా-పాట

కోరుట్ల, ఆగస్టు 3 : పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు చేసిన నృత్యాలు ఆహ్వానితులను అలరింపజేశాయి. పట్టణంలోని జీఎస్ గార్డెన్‌లో ఫ్రెషర్ డే వేడుకలను పురస్కరించుకొని విద్యార్థులు ఆట పాటలతో గడిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల కేరింతల మధ్య గార్డెన్ సందడిగా మారింది. ఇంటర్ విద్యలను ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల కు కళాశాల నిర్వహకులు ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కొప్పుల శ్వేతలతో పాటు ఉపన్యాసకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సంబరాలు

అంబేద్కర్, మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం

కోరుట్ల, ఆగస్టు 3 : ఎస్సీ వర్గాకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎజేఎఫ్ దళిత సంఘ నాయకులు సంబరాలు జరిపారు. అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన నాయకులు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం జరిపారు.

మెట్‌పల్లి, (ఇబ్రహీంపట్నం) : ఎస్సీ వర్గీకర ణపై సుప్రీం కోర్టు తీర్పు వెలువరించడంతో పట్టణంలో మోచి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఉపాధ్యక్షులు బోర్రోల్ల నారయణ, రాము, సాయి చంద్, అంజయ్య, రాజేశ్వర్ పాల్గొన్నారు.

●కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి, మందకృష్ణ మాదిగల చిత్ర పటాలకు క్షీరాఅభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు రమేష్, సూరి, నర్సాగౌడ్, సంతోష్ పాల్గొన్నారు.

కొడిమ్యాల : ఎస్సీ రిజర్వేషన్లను సుప్రీంకోర్టు సమర్థించినందుకు శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ఎమ్మార్పీఎస్ నాయకులు సంబురాలను జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు సురుగు శ్రీను (జగన్) రవి, దుమాల గంగారాం, నరేష్, నారాయణగౌడ్, మల్లికార్జున్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, ప్రభాక ర్‌రెడ్డి, చంద్రమొహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వెల్గటూర్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని వెల్గటూర్ ఉమ్మడి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చెన్న కుమారస్వామి పేర్కొన్నారు. వెల్గటూర్ అంబేద్కర్ చౌక్ వద్ద ఎమ్మార్పీఎస్ మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకనపల్లి సతీష్, బీజేపీ ధర్మపురి నియోజకవర్గ కన్వీనర్ కొమ్ము రాంబాబు, మండల అధ్యక్షుడు గోపతి జనార్ధన్, రావు హన్మంత రావు, అశోక్, సంతోష్, వంశీ పాల్గొన్నారు.

●తెలంగాణ రాష్ట్రంలో 12 శాతం ఉన్న మాదిగ, మాదిగ ఉప కులాలకు న్యాయం జరిగేలా ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పునివ్వడం సంతోషంగా ఉందని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుశనపల్లి రవి పేర్కొన్నారు. శనివారం అంబేద్కర్ చౌక్ వద్ద మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. రామిల్ల సనీల్, దావుల లక్ష్మణ్, బానేష్, మల్లేష్, రవి, శశి, శ్రీకాంత్, రాజేశం, రాజు, చిన్నయ్య పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు క్షీరాభిషేకం చేస్తున్న దళిత సంఘ నాయకులు

మెట్‌పల్లి రూరల్ : ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల నుంచి మంద కృష్ణమాదిగ చేసిన పోరాట ఫలితం సాకరమైందని మాదిగ సంఘం నాయకుడు చిట్యాల రాజారాం అన్నారు. శనివారం మండలంలోని ఆత్మకూర్, ఆత్మనగర్ గ్రామాల్లో నాయకులు డప్పు చప్పుళ్లతో విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఆత్మకూర్ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసినంతరం బాబు జగ్జీవన్ చిత్రపటాలకు స్థానిక నాయకులు క్షీరాభిషేకం చేశారు. నాయకులు చిన్నారాజం మహేష్, రాజం, లక్ష్మీనర్సయ్య, శంకర్, సభ్యులు ఉన్నారు.

మేడిపల్లి: 30 సంవత్సరాలుగా పోరాటం చేసి ఏళ్ల కల నేరవేర్చిన సందర్భంగా మాదిగ రిజర్వేషన్ పోరాట నాయకుడు మందకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. మేడిపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ గౌరవ నేత మందకృష్ణ మాదిగ చేసిన పోరాటం ఫలించి ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇబ్రాయిల్, దీపక్, ప్రేమ్‌సాగర్, శంకర్, రాజేష్, నితీష్, లక్ష్మీనర్సయ్య, గౌతమ్, అన్వేష్ పాల్గొన్నారు.

భీమారం: ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ భీమారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం సంబరాలు చేసుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిలువేరు వెంకటే ష్, సంఘం నాయకులు కిషన్, నల్లపురాన్ పెరుమయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తం సమాచారం

కథలాపూర్ : మండల ప్రత్యేకాధికారిగా జిల్లా డీఆర్‌డీఓ ఏపీడీ మదన్‌మోహన్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

మల్లాపూర్ : మల్లాపూర్ గ్రామానికి చెందిన ధ్యావతి పబ్బ మారుతి కుటుంబ సభ్యులకు మెట్‌పల్లి డివిజన్ ధ్యావతి పోతురాజు సంక్షేమ సంఘం నాయకు లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మారుతి కుటుంబాన్ని పరామర్శించి రూ. 10వేల ఆర్థిక సహాయం చేశారు. ధ్యావతి పోతురాజు సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంబటి జలంధర్, ఉపాధ్యక్షుడు ధ్యావతి ప్రకాష్ పాల్గొన్నారు.

జగిత్యాల అర్బన్: పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. స్థానిక వాసవి గార్డెన్‌లో జరిగిన కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ రాజేందర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నేరెళ్ల మల్లేశం గౌడ్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో శనివారం బోనాల పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు అమ్మవారికి బోనం సమర్పించారు. అలాగే జాతీయ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని అవయవదానం ప్రాముఖ్యతను వివరించారు. కరస్పాండెంట్ మిట్టపల్లి మహేష్‌రెడ్డి, యజ్ఞశ్రీ, రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల టౌన్ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సుధీర్‌రావు శనివారం జగిత్యాల ఎమ్మెల్యేను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

అలాగే జగిత్యాల జిల్లా యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో మద్దతు తెలపాలని కోరుతూ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను జిల్లా యూత్ అధ్యక్ష అభ్యర్థి క్యాస సంజీవ్ కలిసి విన్నవించారు. నాయకులు సుమన్‌రావు, కత్రోజీగిరి, ఏనుగులరాజు ఉన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలోని 1, 4, 5 వార్డులలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ శనివారం పరిశీలించారు. కౌన్సిలర్లతో పర్యవేక్షించి పరిసర ప్రజలకు సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శివారు ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల పరిసరాల్లో ఫాగింగ్ చేయించారు.

కొడిమ్యాల : మండలంలోని పలు గ్రామాల్లోని కుల సంఘాల భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని శనివారం మండల బీజేపీ నాయకులు శనివారం కరీంనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందించారు. వినతి పత్రం అందించిన వారిలో మండల బీజేపీ అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్ రెడ్డి, బోగ రాకేష్, రాజు, మహేందర్ ఉన్నారు.

వెల్గటూర్: మండల కేంద్రంలోని విజ్ఞాన్ కిడ్స్ పాఠశాలలో శనివారం గోరింటాకు సంబరాలు నిర్వహించారు. చిన్నారులు చేతులకు గోరింటాకు పెట్టుకొని ఎర్రగా పండిన చేతులను చూసి మురిసి పోయారు.

వానాకాలం పంటకు సాగునీరు అందించాలి

జగిత్యాల అర్బన్, జూలై 3: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి పంట పొలాలకు సాగునీటిని విడుదల చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టులో వరదనీరు చేరి నీటిమట్టం సుమారు 45 టీఎంసీలకు చేరిన నేపథ్యంలో ఖరీఫ్ పంట సాగుకు తక్షణమే నీటిని విడుదల చేయాలని కోరారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లి, ఆగస్టు 3 (ఇబ్రహీంపట్నం) : నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. నియోజక వర్గంలోని బీసీ వెల్ఫేర్ హాస్టళ్ల అభివృద్ధికి, బస్టాండ్‌లలో మౌలిక వసతుల కల్పనకు నిధులు మం జూర్ చేయాలని కోరినట్లు తెలిపారు.